క్లుప్తంగా

'108'లో ప్రసవం



వర్ధన్నపేట : 108 వాహనంలో గర్భిణి ప్రసవించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని ల్యాబర్తికి చెందిన జానపతి శిరీషకు పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. ఈ క్రమంలో ఆమెను 108 వాహనంలో వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువవడంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కగా నిలిపేసి కుటుంబ సభుల సహకారంతో పైలెట్ రాజు, ఈఎంటీ నాగరాజు అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. శిరీష ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం శిరీషను, శిశువును 108 సిబ్బంది వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

'కాంగ్రెస్ టికెట్ ఖాయం'

రాయపర్తి : పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి తనకు టికెట్ రావడం ఖాయమని ఆ పార్టీ మధ్యప్రదేశ్ ఓబీసీ ఇన్‌చార్జ్, ఏఐసీసీ నేషనల్ జెంట్ కోఆర్డినేటర్ ఉల్లెంగుల యాదగిరి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ములుగు జిల్లాలో జరగనున్న బహిరంగ సభలో తన పేరును ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అఖండ నామ సంకీర్తన



గీసుకొండ : మండలంలోని ఊకల్‌హవేలిలోని నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 41 రోజులపాటు దీక్ష చేపట్టిన స్వాముల అఖండ నామ సంకీర్తన నామయజ్ఞ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాచర్ల బాబూరావు, కార్యదర్శి కొత్తగట్టు రాజేందర్ పాల్గొన్నారు.

కార్యకర్త మృతదేహానికి మంత్రి ఎర్రబెల్లి నివాళి



రాయపర్తి : మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త కోలా రామ్మూర్తి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా అతడి మృతదేహానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో మంత్రి పాల్గొని పాడె మోశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, సర్పంచ్ నలమాస సారయ్య, సంపత్, అశోక్ పాల్గొన్నారు.

పెద్దమ్మగడ్డలో..

ఖానాపురం : మండలంలోని పెద్దమ్మగడ్డ గ్రామానికి చెందిన శ్రీను గుండెపోటుతో మృతి చెందగా అతడి దేహానికి నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, రెడ్డి నాగార్జున్‌రెడ్డి, తదితరులున్నారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు రఫీక్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి తోటి దివ్యాంగులు ఆర్థికసాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సంఘం దివ్యాంగులు ముప్పిడి శ్రీలత, కత్తి శ్యామ్, ఆదర్శ గ్రూప్ సభ్యులు గాదె అనిత, పెంతల రమ, బల్ల యాకలక్ష్మి, గుమ్మడిరాజు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్ల ఢీ



వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లిలోని ఆకేరు వాగు వద్ద ఓ ట్రాక్టర్‌ను వెనక నుంచి మరో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక నింపుకుని వెళ్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లు పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో మితిమీరిన వేగంతో వెళ్లడంతో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడగా వెనక నుంచి ఢీకొట్టిన ట్రాక్టర్ టైర్లు విరిగి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. కాగా రెండు ట్రాక్టర్ల డ్రైవర్లు సమయస్ఫూర్తితో వ్యవహరించి పక్కకు దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

● ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో తనను ఆదరించాలని ప్రజలను ఎమ్మెల్యే అరూరి రమేశ్ కోరారు. సీఎం కేసీఆర్ నుంచి బీఫాం అందుకున్న క్రమంలో పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల కోసం రాజకీయం చేస్తున్న, వారెంటీ లేని కాంగ్రెస్ నాయకుల గ్యారెంటీ పథకాలను నమ్మొద్దని చెప్పారు. కేవలం ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చి హామీలు గుప్పిస్తున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో రూ.2,277 కోట్లతో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అందజేసినట్టు తెలిపారు. ప్రజలతో మమేకమై పనులు చేస్తున్నట్టు తెలిపారు. గతానికి మించిన మెజార్టీతో తనను గెలిపిస్తారని భావిస్తున్నట్టు చెప్పారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో రైతులు ఎరువులు, విద్యుత్ కొరతతో రోడ్డు మీద ఆందోళనలు చేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో రైతుల కష్టాలు తీరాయని తెలిపారు. బీఆర్‌ఎస్ రైతు అనుకూల ప్రభుత్వమని చెప్పారు. ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలిత యాదవ్, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ భిక్షపతి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమారస్వామి, ఎంపీపీ మార్నేని మధుమతి రవీందర్‌రావు, కార్పొరేటర్ నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్

బీఆర్‌ఎస్‌లో చేరిక

మండలంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన 50 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే రమేశ్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తున్నారని తెలిపారు. పలు పార్టీలకు చెందిన శ్రేణులు చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో నరేందర్, అరుణ్‌కుమార్, అభిషేక్, రాజశేఖర్, అన్వేశ్, తదితరులున్నారు.

ఘనంగా బతుకమ్మ



దుగ్గొండి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నర్సంపేట : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నర్సంపేట : పట్టణంలో మంగళవారం ఘనంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థినులు ఆడిపాడారు. కళాశాల డైరెక్టర్ సృజన ప్రభాకర్‌రెడ్డి బతుకమ్మతో హాజరు కాగా విద్యార్థినులు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. అనంతరం విద్యార్థినులకు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి బహుమతులు అందించి అభినందించారు.

దుగ్గొండి : మండల కేంద్రంలో 34 గ్రామాల నుంచి మహిళలు హాజరు కాగా వారితో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ పెద్ది స్వప్న బతుకమ్మ ఆడి ఉత్సాహపర్చారు. అనంతరం ఆమె మాట్లాడారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ చొరవతో బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి, ఎంపీపీ కోమల, జాగృతి జిల్లా అధ్యక్షురాలు సాంబలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు లలిత, తదితరులు పాల్గొన్నారు.



సంగెం : సిద్ధార్థ హైస్కూల్‌లో..

సంగెం : మండలంలోని మొండ్రాయిలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. సిద్దార్థ హైస్కూల్‌లో విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆటలాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు నాగమణి, వందన, స్వరూప, కవిత, శాంతకుమారి, మౌనిక, ప్రవళిక, రాధిక, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



ఖానాపురం : మాట్లాడుతున్న సీఐ కిషన్



నెక్కొండ : కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ హథీరాం

ఖానాపురం : ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సీఐ పుల్యాల కిషన్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీ నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని చెప్పారు. ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్సై మాధవ్, నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టులు పెడితే చర్యలు

నెక్కొండ : సోషల్ మీడియా, వాట్సప్‌ల్లో వివాదస్పద పోస్టులు పెడితే చర్యలు తప్పవని సీఐ హథీరాం నాయక్ తెలిపారు. మండలంలోని వివిధ వాట్సప్ గ్రూపుల అడ్మిన్లు, రాజకీయ పార్టీల నాయకులతో పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో 18 మందిని తహసీల్దార్ రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. సమావేశంలో ఎస్సై జానీపాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రాయపర్తి : మాట్లాడుతున్న ఎస్సై విజయ్‌కుమార్

డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్

రాయపర్తి : పోలీస్‌స్టేషన్‌లో డీజే నిర్వాహకులకు ఎస్సై విజయ్‌కుమార్ కౌన్సెలింగ్ చేశారు. ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో ఏసీపీ పరిశీలన



రాయపర్తి : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్లను సీఐ శ్రీనివాస్‌తో కలిసి వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్ మంగళవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా సరిత



గీసుకొండ : మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా మండలంలోని కొమ్మాలకు చెందిన జక్కుల సరితను నియమించారు. ఈ మేరకు హనుమకొండలోని నివాసంలో పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆమెకు నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల ఎమ్మెల్యేగా ఇనగాలను గెలిపించడానికి మహిళలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను చేపడతానని సరిత తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం మంజూరు చేయండి

పర్వతగిరి : బాధిత రైతులకు పంట నష్టపరిహారం మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. ఈ మేరకు బాధిత రైతులతో కలిసి వారు హనుమకొండలోని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీధర్, ప్రదీప్‌రావు మాట్లాడారు. పంట నష్టాన్ని అధికారులు సర్వే చేశారని, బాధితులకు పరిహారం అందలేదని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి బాధితులందరికీ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు చెవులపెల్లి చలపతిరావు, పల్లెపాటి రామచంద్రారావు, నాగినేని సుదర్శన్‌రావు, బండి కట్టయ్య, రాములు, సత్యనారాయణ, మామిళ్ల శీను, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

'డీఎస్పీ అభ్యర్థిని గెలిపించాలి'



రాయపర్తి : పాలకుర్తి నియోజకవర్గంలో ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూడిద సునీల్‌ను గెలిపించాలని జిల్లా నాయకులు దామెర శ్రావణ్, ఠాగూర్‌నాథ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీల్‌తో కలిసి శ్రావణ్, ఠాగూర్‌నాథ్ మాట్లాడారు. పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీల తరపున అగ్రకుల పార్టీలకు భిన్నంగా ఎన్నికల యుద్ధంలో నిలవనుందని చెప్పారు. బ్యాటరీ టార్చ్‌లైట్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. తద్వారా మెరుగైన పాలనకు అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గారె వెంకటస్వామి, సదానందం, గణేశ్, దావీద్, స్వామి, సతీశ్, కరుణాకర్, శ్రీను, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణ సామాజిక బాధ్యత

● రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్

రాయపర్తి : గోవుల సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని తెలంగాణ గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ ఆకాంక్షించారు. మండలంలోని బందనపల్లిలో శ్రీ బాలాజీ గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు మంగళవారం ఆయన 20 లేగదూడలను పంపిణీ చేసి మాట్లాడారు. ఆరోగ్యదాయకమైన పంటలను పండించేందుకు గోవుల పేడ, మూత్రం ఉపయోగపడతాయని తెలిపారు. గోవులను కాపాడుకొని వ్యవసాయంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ దుర్గం రోజ, సర్పంచ్ దీప్లా నాయక్, గోశాల ప్రతినిధి రాజేశ్, కార్యదర్శి రవీందర్, వార్డు సభ్యుడు దేవ్యా పాల్గొన్నారు.



రైతులకు లేగదూడలు పంపిణీ చేస్తున్న మహేశ్

'గ్రామైక్య' సేవలను వినియోగించుకోండి

వర్ధన్నపేట : మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామైక్య సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సీసీ గోలి కొమురయ్య కోరారు. మండలంలోని ఇల్లంద గ్రామంలో గంగా గ్రామైక్య సంఘం సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించగా సీసీ మాట్లాడారు. న్యూ ఎంటర్‌ప్రైజెస్, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యక్రమాల్లో భాగంగా సీఎం ఎస్ఎం ఈజీపీ, తదితర రాయితీ రుణాలను ఉపయోగించుకోవాలని చెప్పారు. తుంగభద్ర గ్రామైక్య సంఘం ప్రతినిధులు రూ.4 వేల విలువైన వాటర్ బాటిళ్లను 30 సంఘాల లీడర్లకు అందజేశారు. సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు బొంతల మౌనిక, కవిత, నీరజ, అశ్విని, ఎల్లమ్మ, జోగుల అనిషా, అనుమాండ్ల స్వప్న, వీఓఎలు స్రవంతి పాల్గొన్నారు.



వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

రాజకీయాలకు అతీతంగా స్పోర్ట్స్ కిట్‌లు అందించాలి

ఖానాపురం : రాజకీయాలకు అతీతంగా పల్లెల్లోని యువతకు స్పోర్ట్స్ కిట్‌లు అందించాలని కోరుతూ ఎంపీడీఓ సుమణ వాణికి మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన యువకులు ఎల్లాగౌడ్, మురళి, మహేశ్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం అందించిన స్పోర్ట్స్ కిట్‌లను బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన యూత్‌కు మాత్రమే అందిస్తున్నారని వాపోయారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శంకర్, శివ, నరేశ్, ప్రశాంత్, లింగన్న, రాజు, వినయ్, ముకేశ్, యోగి, తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్ ఆశయాలను కొనసాగించాలి

గీసుకొండ : అసెంబ్లీ టైగర్‌గా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ఎంసీపీఐ వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ ఆశయాలను కొనసాగించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి కోరారు. ఓంకార్ 15వ వర్ధంతి సందర్భంగా మండలంలోని మచ్చాపూర్ సమీపంలోని ఆయన స్తూపానికి మంగళవారం నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓంకార్ దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. ప్రొఫెసర్ మరింగంటి యాదగిరిచార్యులు మాట్లాడుతూ అంతరాలు లేని సమాజ నిర్మాణానికి కుల వ్యవస్థ అడ్డంకిగా ఉందన్నారు. సామాజిక న్యాయమే పరిష్కార మార్గమని ఓంకార్ బలంగా నమ్మారని చెప్పారు. అందుకోసమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, గొనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, ఎస్‌రెడ్డి హంసారెడ్డి, నాయకులు గడ్డం నాగార్జున, వంగాల రాగసుధ, సావిత్రి, నాగెల్లి కొమురయ్య, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్దికాయల ఓంకార్ స్ఫూర్తిని కొనసాగించాలి

నర్సంపేట : మాజీ ఎమ్మెల్యే ఓంకార్ స్ఫూర్తిని కొనసాగించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారపు రమేశ్ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఓంకార్ చిత్రపటానికి రమేశ్, నాయకులు నివాళులర్పించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యుడు కేశెట్టి సదానందం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో గణిపాక బిందు, లక్ష్మి, స్వరూప, నాగరాజు, అయిలమ్మ, భవాని, కొమురమ్మ, స్వప్న, రాజేందర్ పాల్గొన్నారు.

బీసీల ఓట్లన్నీ బీఎస్పీకే..



ముదిరాజ్‌లతో మదన్‌కుమార్

చెన్నారావుపేట : నర్సంపేట నియోజకవర్గంలోని బీసీల ఓట్లన్నీ బీఎస్పీకే పడతాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండాల మదన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాపయ్యపేటలో ముదిరాజ్ కులస్తులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులను బీసీ ×ఏ×లో చేర్చాలని, మత్స్య సహకార సంఘాల నిధులను డైరెక్ట్‌గా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్ద హంస చంద్రయ్య, ఉప్పరి కొంరయ్య, అనిల్ కనకయ్య, వినోద్, సాంబయ్య, నర్సింహస్వామి, వెంకన్న, వెంకటేశ్వర్లు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గామాత దర్శనం

నర్సంపేట : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పదో వార్డు పరిధిలోని పోచమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దుర్గామాత భక్తులకు మంగళవారం దర్శనమిచ్చింది. వేద పండితుడు నిశాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కాట్రపల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన మండపంలో అన్నపూర్ణదేవి రూపంలో దుర్గామాతను అలంకరించారు. భక్తులు పూజలు చేశారు.

దుర్గామాతకు ఎమ్మెల్యే పెద్ది పూజలు

దుగ్గొండి : మండల కేంద్రంలోని దుర్గామాత విగ్రహానికి నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూజ చేశారు. పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి, నాయకులు శానబోయిన రాజ్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : దుర్గామాతకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే

గాయత్రి మాతగా..

చెన్నారావుపేట : అమ్మవారు గాయత్రి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి గెలుపు కోసం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్‌కుమార్ పూజలు నిర్వహించారు. బీఎం శాస్త్రీ, సాయి శాస్త్రీ, గణేశ్ శాస్త్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఆరు గ్యారంటీ'ల అమలు ఖాయం



చెన్నారావుపేట : పార్టీలో చేరిన వారితో దొంతి



నర్సంపేట : మాట్లాడుతున్న మాధవరెడ్డి

● మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం ఖాయమని ఏఐసీసీ సభ్యుడు, పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని బానోజీపేట, పీహెచ్‌సీతండాలకు చెందిన 37 కుటుంబాలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం చేరగా మాధవరెడ్డి వారికి కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. అధికారంలోకి రాగానే గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు, ఇతర అన్ని హామీలను అమలు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్‌నాయక్, యూత్ మండల అధ్యక్షుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని బోజెర్వు, పుల్లయ్యబోడు తండా, చెన్నారావుపేట, అక్కల్‌చెడ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి మాజీ ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, నాయకులు బిల్లా ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు సుపరిపాలన



నర్సంపేట: మేనిఫెస్టోను వివరిస్తున్న నాయకులు



ఖానాపురం: కరపత్రాలతో నాయకులు

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని ఆ పార్టీ 14వ వార్డు కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 13, 14వ వార్డులో మంగళవారం నిర్వహించిన 'గడప గడపకు కాంగ్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. పార్టీని ఆదరించి దొంతి మాధవరెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో 13వ వార్డు కమిటీ ఇన్‌చార్జ్ శ్రీరామోజు మురళి, నాయకులు కొల్లూరి రాజు, సాంబరాజు, సుమన్, కొండోజు కార్తీక్, కొల్లూరి రాజు, మహేశ్, నవీన్, మణి పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ అనేక హామీలతో అధికారంలోకి వచ్చి అన్నిటినీ విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. తొలుత రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు వల్లె శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్ది శ్రీనివాస్, నాయకులు రాజేందర్, మల్లయ్య, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.